సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం । 27 । ఆగస్టు । 2024



అన్నదాన భవనానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి నీలి సూరిబాబు, గణితదేవి దంపతులు (గూడాల) రూ.50,116 విరాళం సమర్పించారు.




కలుపు అనర్థమే..!

8లో

ఏ పంటలోనైనా కలుపు వస్తోంది.. దీనిని పట్టించుకోకుంటే దిగుబడులపై ప్రభావం చూపుతోంది. కలుపు మొక్కల నివారణతో నాణ్యమైన ఉత్పతులకు అవకాశం ఉంటుంది.


మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 2,66,001 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.85 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 12,100 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

డీఎస్పీగా ప్రసాద్ బాధ్యతల స్వీకరణ



అమలాపురం డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ప్రసాద్

అమలాపురం టౌన్: అమలాపురం పోలీస్ సబ్ డివిజన్ కొత్త డీఎస్పీగా టీఎస్ఆర్‌కే ప్రసాద్ సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం జిల్లాలో ఇంటిలిజెన్స్ విభాగం డీఎస్పీగా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకూ డీఎస్పీగా పని చేసిన ఎం.మహేశ్వరరావుకు మంగళగిరి పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని ఆదేశాలు వచ్చాయి. సార్వత్రిక ఎన్నికల ముందు వరకూ జిల్లాలోని రామచంద్రపురం డీఎస్పీగా పనిచేసిన తాను ఇప్పుడు అమలాపురం డీఎస్పీగా అదే అనుభవంతో సమర్థవంతంగా పని చేస్తానని ప్రసాద్ అన్నారు. ఆయన్ని అమలాపురం రూరల్, ముమ్మిడివరం, అమలాపురం పట్టణ సీఐలు పి.వీరబాబు, ఎం.మోహన్‌కుమార్, కె.క్రిష్టోఫర్‌తో పాటు పోలీస్ సబ్ డివిజన్‌లోని ఎస్సైలు మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు, ముఖ్యంగా మహిళలు, బాలికల రక్షణ విషయంలో అప్రమత్తంగా ఉండి సీఐలు, ఎస్సైల సమన్వయంతో ముందుకు వెళ్తామని డీఎస్పీ అన్నారు.

ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ

సాక్షి, అమలాపురం: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న క్రీడా వారోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లాలో విద్యార్థులు, క్రీడాకారులతో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ చేయించినట్లు జిల్లా క్రీడాధికారి పీఎస్ సురేష్ కుమార్ తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవం ఈ నెల 29న జరగనుందని, ఇందులో భాగంగా ఈ నెల 23 నుంచి 31 వరకూ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

వచ్చే నెల 16న ప్రత్యేక బస్సు

రావులపాలెం: భక్తుల సౌకర్యార్థం ఏడు రోజుల రామేశ్వరం సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్ ఆర్టీసీ రావులపాలెం డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ సోమవారం తెలిపారు. వచ్చే నెల 16న రావులపాలెం నుంచి బస్సు బయలు దేరి 23న తిరిగి యథాస్థానానికి చేరుతుందన్నారు. టిక్కెట్ ధర మనిషికి రూ.8,500 (భోజనంతో సహా) నిర్ణయించినట్టు మేనేజర్ తెలిపారు. కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, శ్రీరంగం, జంబుకేశ్వరం, పళని, కొయంబత్తూరు (ఇషా ఫౌండేషన్), మధురై, రామేశ్వరం, ధనుష్ కోటి, తంజావూరు, కాంచిపురం, శ్రీకాళహస్తి, విజయవాడ మీదుగా చేరుతుందన్నారు. మరిన్ని వివరాలకు, టిక్కెట్ రిజర్వేషన్ కోసం అసిస్టెంట్ మేనేజర్ 73829 11871 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

మండపేట: హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని డీసీసీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అన్నారు. ఏడిద రోడ్డులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు హామీలు గుప్పించి నేడ పింఛన్ పథకానికి మాత్రమే పరిమితం అయ్యారంటూ ధ్వజమెత్తారు. మిగిలిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చిన మరుక్షణమే సూపర్‌సిక్స్ పథకాలతో సిక్సలు మీద సిక్సలు కొడతామని పలికిన ప్రగల్బాలు ఏమయ్యాయని ఎద్దేవా చేశారు. ఉచిత ఆర్టీసీ బస్సు పథకం అమలు దగ్గర నుంచి నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, రైతులకు చేసిన హామీల వరకూ ఎక్కడ అమలు చేశారో చెప్పాలన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం ఏమైందని దుయ్యబట్టారు. ప్రతీ మహిళకు రూ.1,500 ఇస్తానని చెప్పిన మాటలన్నీ మాయమాటలేనా అన్నారు. 50 సంవత్సరాలు నిండిన ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనారిటీలకు ఇస్తానన్న పెన్షన్లు బూటకమేనా అని ప్రశ్నించారు.

రత్నగిరిపై ఘనంగా కృష్ణాష్టమి

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఉదయం స్వామివారి సన్నిధిలో గోపూజోత్సవం, రాత్రి ఉట్లోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9-30 గంటలకు రత్నగిరిపై రామరాయ కళావేదిక మీద సత్యదేవుడు అమ్మవారిని ప్రతిష్ఠించి పండితులు పూజలు చేశారు. అనంతరం గోపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవులకు అర్చకస్వాములు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వాటికి ప్రదక్షిణ చేశారు.

దోషులను శిక్షించాలి



కోల్‌కతా మహిళా డాక్టర్‌పై జరిగిన సంఘటన చాలా దురదృష్టకరం. ఈ ఆటవిక చర్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా పరిగణించాలి. దోషులను కఠినంగా శిక్షించాలి. వైద్య కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో మహిళా డాక్టర్లకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. రాత్రి సమయాల్లో ఆస్పత్రుల్లోకి వచ్చే వారిపై నిఘా పెట్టాలి. మత్తు పదార్థాలు తాగే వారిపై చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ ప్రదీప్తికరుణ, గైనకాలజిస్టు, ఐవీఎఫ్ ఫెర్టిలిటీ స్పెషలిస్టు, కొత్తపేట



చట్టాలను కఠినంగా అమలు చేయాలి



కోల్‌కతా ఘటనను పరిగణనలోకి తీసుకుని, మళ్లీ అటువంటి సంఘటనలు దేశంలో ఎక్కడా పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలను తీసుకురావాలి. ఆస్పత్రుల్లో నైట్ డ్యూటీ చేసే మహిళా వైద్యులు, నర్సులు భయాందోళనతో విధులు నిర్వర్తిస్తున్నారు. వైద్యం కోసం కొందరు, తగాదాలు పడి కొందరు, మద్యం మత్తులో కొందరు ఆస్పత్రులకు వస్తుంటారు. అటువంటి వాటికి అవకాశం లేకుండా ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ ఎంఆర్ఎల్ భీమారెడ్డి, లాప్రోస్కోపిక్ సర్జన్, భవానీ హాస్పటల్, రావులపాలెం

కొబ్బరి... కొన ఊపిరి

- సంక్షోభంలో సాగు బాట
- మూడు జిల్లాల్లో 1.50 లక్షల ఎకరాల్లో పంట
- వెంటాడుతున్న తెగుళ్లు, దిగుబడిపై ప్రభావం
- నేటి నుంచి రెండు రోజులు కొబ్బరి జాతీయ సదస్సు
- దక్షిణాది రాష్ట్రాల నుంచి రైతు ప్రతినిధుల రాక



2020లో తెల్లదోమ ఉధృతంగా ఉన్న సమయంలో కొబ్బరి చెట్టు



మన రాష్ట్రంలో వెయ్యికాయలకు 90 కిలోలు దిగుబడిగా వచ్చిన ఎండు కొబ్బరి

సాక్షి, అమలాపురం: ఉద్యాన పంటల్లో అత్యధిక ఆదాయం అందించే వృక్షం.. ఆరోగ్యానికి అమృత భాండం. అధిక కాలం నిల్వ ఉండే ఫలం. ఒకటి కాదు.. రెండు కాదు.. సుమారు 106 విలువ ఆధారిత ఉప ఉత్పత్తులను తయారు చేసే విలువైన కల్పవృక్షం కొబ్బరి. కానీ దశాబ్దా కాలంగా సాగు.. వ్యాపారం.. ఎగుమతులు ఇలా అన్ని విభాగాల్లోనూ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వరి తరువాత అతి పెద్ద సాగు కొబ్బరి. రాష్ట్రంలో కొబ్బరి మూడు లక్షల ఎకరాల్లో సాగవుతుండగా, తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో 1.50 లక్షల ఎకరాల్లో, ఒక్క కోనసీమ జిల్లాలో 1.10 లక్షల ఎకరాల్లో పంట ఉంది. మరో 25 వేల ఎకరాలకు సరిపడా కొబ్బరి చెట్లు రోడ్లు, చెరువుల, ఇళ్ల వద్ద ఉన్నాయని అంచనా. ఏడాదికి ఎకరాకు సగటు 7 వేల కాయల చొప్పున ఏటా 122.50 కోట్ల కొబ్బరి కాయలు దిగుబడిగా వస్తున్నాయి.

కొబ్బరి సాగు దశాబ్దంన్నర కాలంగా సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. 2008లో నల్లి తెగులు (ఇరియోఫిడ్ మైట్) మొదలైన నాటి నుంచి 2019లో తెల్లదోమ (రూగోస్ వైట్ ఫ్లై) వరకూ తెగుళ్లు, పురుగుల దాడితో కొబ్బరి చెట్టుకు తీరని గాయాలవుతున్నాయి. ఆకుతేలు, ఎర్రముక్కు పురుగు, గానోడెర్మా వంటి తెగుళ్ల సోకగా, వీటి నివారణకు చేపట్టిన చర్యలు పెద్దగా ఫలితాన్ని ఇవ్వడం లేదు. తెల్లదోమ వల్ల 30 శాతం సగటు దిగబడి పడిపోయినట్టు అంబాజీపేటలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా స్థానం శాస్త్రవేత్తల సర్వేలో తేలింది.

- కొబ్బరి సాగు పెట్టుబడులు గణనీయంగా పెరగడంతో ఏటా పెట్టుబడి రూ.78 వేలు కావడం విశేషం. ఎరువులు, పురుగు మందుల ధరలు, తెల్లదోమ నివారణ చర్యలు, దింపు కార్మికులు, రవాణా కూలీల రేట్లు గణనీయంగా పెరిగాయి. కొబ్బరికాయ ప్రస్తుత ధర రూ.10.50 కాగా, ఈ ఏడాది సగటు ధర రూ.8. దింపు, కూలీ, చేరవేత ఇలా అన్ని ఖర్చులు పోనూ కాయకు రూ.6 మిగులుతోంది. దీనిని పరిగణనలోకి తీసుకుంటే ఎకరాకు రూ.42,500 ఆదాయం వస్తోందని అంచనా. పెట్టుబడి పోగా రైతుకు రూ.35,500 నష్టం వస్తోంది.
- కొబ్బరి సాగుకు ప్రభుత్వాల నుంచి వస్తున్న ప్రోత్సాహం అంతంత మాత్రమే. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకాన్ని కొబ్బరి తోటలకు అనుసంధానం చేయడంతో కొంతవరకూ వెసులుబాటు కలిగింది. కొబ్బరి చెట్లకు పళ్లాలు వేయడం, పంట బోదెలు తవ్వకాలు వంటి పనులు ఉపాధి పథకంలో చేపట్టడం వల్ల రైతులకు ఎకరాకు రూ.12 వేల వరకూ మేలు జరిగింది. దీనికితోడు వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా అర్హులైన రైతులకు ఏటా రూ.13,500ల వరకు ప్రోత్సాహం అందేది. దీంతో సన్న, చిన్న కారు రైతులకు కొంతవరకు పెట్టుబడి కలసి వచ్చేది.
- మిగిలిన దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, కేరళతో పోలిస్తే రాష్ట్రంలో దిగుబడిగా వచ్చే కొబ్బరి కాయ సైజు తక్కువ. తమిళనాడులో డొక్క తీసిన కాయ (చిప్పతో కలిపి) సగటు బరువు 625 గ్రాముల నుంచి 650 గ్రాముల వరకు వస్తుండగా, రాష్ట్రంలో పండిన కొబ్బరి కాయ బరువు 280 గ్రాముల నుంచి 350 గ్రాముల వరకూ ఉంది. దీనివల్ల ఉత్తరాది రాష్ట్రాలలో స్థానిక కొబ్బరికాయకు పెద్దగా డిమాండ్ ఉండడం లేదు. దేవాలయాల వద్ద, నదులకు అర్పించే కొబ్బరి కాయల కోసం మాత్రమే ఇక్కడ నుంచి కొనుగోలు చేస్తున్నారు.
- కొబ్బరి (కాయలోపల కొబ్బరి ముక్క) దిగుబడి పరిశీలిస్తే తమిళనాడులో వెయ్యి కొబ్బరి కాయల నుంచి సుమారు 120 నుంచి 135 కిలోల ఎండు కొబ్బరి ఉత్పత్తి అవుతుంటే... ఇక్కడ వెయ్యి కొబ్బరి కాయల నుంచి 90 కిలోలు మాత్రమే కొబ్బరి దిగుబడి వస్తోంది. 100 కిలోల ఎండు కొబ్బరి నుంచి నూనె కూడా ఇతర రాష్ట్రాల్లో 65 కిలోల వరకూ వస్తుంటే ఇక్కడ మాత్రం 63 కిలోలు మాత్రమే వస్తోంది.
- కొబ్బరి చెట్టు నుంచి, కొబ్బరి కాయ నుంచి సుమారు 106 విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసే అవకాశముంది. తమిళనాడు, కేరళలలో రైతు, స్థానిక వ్యాపారులు కలిసి స్థానికంగా 26 రకాల ఉత్పత్తులు తయారు చేస్తుండగా, ఇక్కడ క్వాయర్ ఉత్పత్తులతో కలిపి కనీసం పది రకాల ఉత్పత్తులు కూడా తయారు కావడం లేదు. కొబ్బరి, కొబ్బరి నీరు, కొబ్బరి నీరా వంటి వాటితో ఉత్పత్తులను తయారు చేయవచ్చు. కానీ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకు రావడం లేదు. పైగా ఏపీలో ఉత్పత్తి అయ్యే కొబ్బరి నుంచి ఉప ఉత్పత్తులు తయారు చేస్తే పెద్దగా గిట్టుబాటు కావడం లేదనే విమర్శలు కూడా ఉన్నాయి.

నేటి నుంచి జాతీయ సదస్సు

కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో మంగళవారం నుంచి రెండు రోజుల పాటు కొబ్బరిపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సుకు దక్షిణాది రాష్ట్రాలకు చెందిన సుమారు 30 మంది రైతులు తరలివస్తున్నారు. తొలి రోజు స్థానిక జనహిత భవన్‌లో కొబ్బరి రైతుల సమస్యలపై చర్చిస్తారు. రెండో రోజు కిమ్స్ మెడికల్ కాలేజీలో జరిగే సదస్సుకు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన రైతులతోపాటు విశాఖ జిల్లా నుంచి రైతులు రానున్నారు.

దారుణంగా పడిపోయిన దిగుబడి



ప్రస్తుత పరిస్థితుల్లో కొబ్బరి రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. ఆశించిన స్థాయిలో కొబ్బరి దిగుబడులు రాకపోవడం, కూలీల ఖర్చులు పెరిగిపోవడంతో నష్టాలు చవిచూస్తున్నాం. మార్కెట్‌లో భూముల ధరలు పెరుగుతుండడం వల్ల రైతులు కొబ్బరి సాగు చేస్తున్నారు కాని, దీని ఆదాయం మీద ఆధారపడే రైతులు ఎవరూ లేరు.

– దొమ్మేటి త్రిమూర్తులు, కొబ్బరి రైతు, మాచవరం, అంబాజీపేట మండలం

సాంకేతిక పరిజ్ఞానం చేరక..



ఇక్కడ నిపుణుల లోటు ఉంది. క్వాయర్ బోర్డు, కోకోనట్ బోర్డు (సీడీబీ) నైపుణ్య శిక్షణ ఇస్తున్నా యువత ముందుకు వెళ్లడం లేదు. మార్కెట్‌పై యువతకు అవగాహన ఉండడం లేదు. గతంలో పెట్టిన పరిశ్రమలు దెబ్బ తినడంతో కొత్తవారు, యువత భయపడి ముందుకు రావడం లేదు. ప్రభుత్వం, ఆయా సంస్థలు ఇచ్చే రాయితీలు వెంటనే విడుదల చేయడం లేదు. సాంకేతికత పరిజ్ఞానం రైతులకు చేరడం లేదు.

–పెదమల్లు నాగబాబు, క్వాయర్ నిపుణుడు, పాశర్లపూడిలంక, మామిడికుదురు మండలం

‘అన్న’న్నా ఇంత ఖర్చా?

- అన్న క్యాంటీన్ శకటానికి రూ.2.85 లక్షలు
- ప్రశ్నించేందుకు కొందరు కౌన్సిలర్లు సిద్ధం
- నేటి కౌన్సిల్ సమావేశంలో జరగనున్న చర్చ

అమలాపురం టౌన్: ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అమలాపురం బాలయోగి స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి వేడుకలు, ప్రదర్శనల్లో అన్న క్యాంటీన్ ప్రగతి రథం పేరుతో స్థానిక మున్సిపాలిటీ శకటం రూపొందించింది. దీని తయారీకి రూ.2.85 లక్షల ఖర్చు చూపించిన అంశం అటు కొందరు కౌన్సిలర్లు, ఇటు పట్టణ ప్రజల్లో చర్చనీయాంశమైంది. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం జరిగే కౌన్సిల్ సమావేశంలో కొందరు కౌన్సిలర్లు అన్న క్యాంటీన్ శకటానికి చూపించిన ఖర్చుపై అధికారులను ప్రశ్నించేందుకు సిద్ధం అవుతున్నారు. కౌన్సిల్ ఆమోదానికి అజెండాలోని ఆరో అంశంగా ఈ ఖర్చును అధికారులు చూపించారు. దీనిపై కౌన్సిల్ పాలక పక్షానికి చెందిన కౌన్సిలర్లే కాకుండా ప్రతిపక్షాలకు చెందిన కొందరు చర్చించుకోవడం కనిపించింది. ఈ విషయాన్ని కొందరు పాలకపక్షం కౌన్సిలర్లు మున్సిపల్ ఇంజినీర్లకు సోమవారం ఫోన్ చేసి అన్న క్యాంటీన్ శకటానికి అంత ఖర్చు ఎలా అయ్యిందో ప్రతి ఆధారాన్ని కౌన్సిల్ సమావేశంలో చూపించాలని స్పష్టం చేశారు. కొందరు కౌన్సిలర్లు ఇలా అడగడంతో ఈ శకటానికి అంచనాలు రూపొందించిన ఇంజినీరింగ్ విభాగం సిబ్బందిలో తర్జనభర్జన మొదలైంది. స్వాతంత్ర దినోత్సవం రోజున జరిగిన వేడుకల్లో కొన్ని ప్రభుత్వ శాఖల తమ ప్రగతిపై రథాలను రూపొందించి ప్రదర్శించాయి. ఇందులో భాగంగా అన్న క్యాంటీన్ నమూనా ప్రగతి రథం తయారీ బాధ్యతలను మున్సిపాలిటీకి అప్పగించారు. ఓ వాహనానికి ప్లేఉడ్ షీట్లు ఏర్పాటు చేసి వాటికి రంగులు, పువ్వులు, బెలూన్ల డెకరేషన్ చేసినందుకే రూ.2.85 లక్షల ఖర్చు అవుతుందా..? అంటూ అనుమానాలను కొందరు కౌన్సిలర్లతోపాటు ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఈ శకట అలంకరణ అత్యవసరంగా చేయాల్సి రావడంతో డిజైనింగ్ తదితర పనులు నిమిత్తం ఏఈ-3 రూపొందించిన కొటేషన్ రేట్ల ప్రకారం లోకల్ కాంట్రాక్టర్ల నుంచి కొటేషన్ కూడా స్వీకరించామని ఇంజినీర్లు అజెండాలో లిఖిత పూర్వకంగా ప్రస్తావించారు. టీడీపీకి చెందిన ప్రజా ప్రతినిధుల సూచనలతోనే అన్న క్యాంటీన్ శకటాన్ని ఆగమేఘాలపై అధిక ధరలతో అంచనాలు తయారు చేశారన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. మంగళవారం జరిగే కౌన్సిల్ సమావేశం అజెండాలో ఈ శకటం ఖర్చును ఆమోదించే అంశంపై ఎలాంటి చర్చ జరుగుతుంతో వేచి చూడాల్సిందే. అసలు ఆ అంశాన్ని కౌన్సిల్ ఆమోదిస్తుందా..? లేదా వాయిదా వేస్తుందా...? అనేది కూడా చర్చ జరుగుతోంది.



స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రదర్శించిన అన్న క్యాంటీన్ శకటం ఇదే..

మంత్రి సుభాష్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం తాలూకా శెట్టిబలిజ సంఘానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ బహిరంగ క్షమాపణ చెప్పాలని సంఘ అధ్యక్షుడు కట్టా సూర్యనారాయణ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రామచంద్రపురం శెట్టిబలిజ సంఘ పెద్దలను అసమర్థులంటూ ఆయన చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ శెట్టిబలిజ సంఘం పటిష్టంగా ఉండటం వల్లే ఏ పార్టీ అయినా రామచంద్రపురం నియోజకవర్గానికే శెట్టిబలిజ సీటును ఇస్తుందనేది మంత్రి ముందుగా గుర్తించాలన్నారు. మంత్రి సుభాష్ ఇక్కడ ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత శెట్టిబలిజ సంఘం విషయంలో తప్పుడు విధానాలు అవలంబిస్తున్నారని అన్నారు. గతంలో ఎప్పుడూ శెట్టిబలిజ సంఘం సమావేశాలకు కనీసం ఒక్క పోలీస్ కానిస్టేబుల్ అయినా వచ్చిన దాఖలాలు లేవన్నారు. ఈ నెల 18న శెట్టిబలిజ సంఘానికి కార్యవర్గం ఎన్నిక నిర్వహించుకుందామని మీటింగ్ పెట్టుకుంటే మీ అనుచరులు కొంతమందికి మద్యం తాగించి సమావేశానికి తీసుకు రావడమే కాకుండా డీఎస్పీ, సీఐలు, ఎస్సైలు, సుమారు 60 మంది పోలీసులు, పారామిలటరీ బలగాలను మోహరింపజేసి సంఘాన్ని భయభ్రాంతులకు గురి చేశారన్నారు. అంతే కాకుండా కార్యవర్గ ఎన్నిక జరగకుండా చేశారన్నారు. సంఘాన్ని అడ్డుపెట్టుకుని సెటిల్‌మెంట్లతో ఆస్తులు సంపాదించుకోవాలని చూస్తున్న వారిని పక్కన పెట్టుకుని తిరుగుతున్న మీరు సమాధానం చెప్పాలన్నారు. రామచంద్రపురం శెట్టిబలిజ కల్యాణ మండపం దుస్థితిని చూసి మంత్రి ఆవేదన చెందారని పత్రికల్లో వచ్చిన వార్తలను చూసి చాలా ఆశ్చర్యం కలిగిందన్నారు. మీ సొంతూరు అమలాపురంలో పెచ్చులూడిన స్థితిలో ఉన్న శెట్టిబలిజ సంఘ భవనంతో పోల్చుకుంటే రామచంద్రపురం శెట్టిబలిజ సంఘ భవనం మంచి స్థితిలోనే ఉందన్నారు. తోటి శెట్టిబలిజ సంఘీయులను అజ్ఞానులని, మెదడు మోకాళ్లలో ఉందని చేసిన వ్యాఖ్యలను మంత్రి వెనక్కి తీసుకోవాలన్నారు. అదే విధంగా తప్పుడు ప్రచారాలతో రామచంద్రపురం శెట్టిబలిజ సంఘం ప్రతిష్టను మంట కలపవద్దని మంత్రిని కోరుతున్నామన్నారు.

అవినీతి రిజిస్ట్రేషన్

- రూ.సొమ్ము కొట్టు.. పోస్టు పట్టు
- అను'మతి'లేని బదిలీల తంతు
- ఐదేళ్లు నిండకున్నా రిక్వెస్ట్ ఇవ్వాల్సిందే
- పోస్టింగ్‌ల కోసం బేరసారాలు
- రూ.30 లక్షల నుంచి రూ.కోటి



సర్పవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



అమలాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ‘అలూ లేదు చూలా లేదు కొడుకు పేరు సోమలింగం’ అన్న సామెత చందంగా షెడ్యూల్ రాకుండానే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీల బ్రోకర్‌లు బరితెగిస్తున్నారు. రోజూ రూ.కోట్లలో లావాదేవీలు జరిగే ఆ శాఖ అవినీతికి కేరాఫ్‌గా మారింది. లావాదేవీలను బట్టి పోస్టుకో రేటు పెట్టేశారు. బదిలీల ప్రక్రియకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఉత్తర్వులు వెలువడకుండానే డిమాండ్‌ను బట్టి పోస్టుకో రేటు నిర్ణయించేశారు. ఈ మొత్తం వ్యవహారంలో శాఖ ప్రధాన కార్యాలయంలో మార్కెట్ అండ్ ఆడిట్ జిల్లా రిజిస్ట్రారుగా పనిచేస్తున్న అధికారి చక్రం తిప్పుతున్నారు. అధికారి లేదా ఉద్యోగి అవసరాలతో సంబంధం లేకుండా అందరూ కచ్చితంగా రిక్వెస్ట్ సబ్‌మిట్ చేయాల్సిందేనంటూ పై నుంచి ఉన్నతాధికారి జారీచేసిన మౌఖిక ఆదేశాలతో అన్ని స్థాయిల్లో అలజడి మొదలైంది. బదిలీ అవసరం లేకున్నా రిక్వెస్ట్ కోసం ఒకటి, రెండు, మూడు ఆప్షన్‌లతో మెసేజ్ చేయాలని చేస్తున్న ఒత్తిళ్లు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంతటా ఆ శాఖ ఉద్యోగుల్లో గుబులు రేపుతున్నాయి.

వసూళ్లకు స్కెచ్

ఉద్యోగులంతా తప్పనిసరిగా బదిలీ అభ్యర్థన (రిక్వెస్టు) ఫారం పూర్తి చేసి జిల్లా డీఐజీలు, జిల్లా రిజిస్ట్రార్‌లకు పంపండి. సబ్ రిజిస్ట్రార్లు, సీనియర్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది ఇది పాటించి తీరాల్సిందేనంటూ ఉన్నతాధికారి జారీచేసిన మౌఖిక ఆదేశాలు హడలెత్తిస్తున్నాయి. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ఆరడజను రిక్వెస్ట్ ఫారాలు వాట్సాప్‌లో పంపించారు. వాస్తవానికి ప్రభుత్వ శాఖల్లో ఒకే ప్రాంతంలో అయిదేళ్ల సర్వీసు పూర్తి చేస్తే తప్పక బదిలీ చేయాలి. కుటుంబ, అనారోగ్య సమస్యలున్నా బదిలీ చేయాలి. వీటిని అడ్డం పెట్టుకుని బదిలీలకు బేరసారాలు నడుపుతున్నారు. ఇప్పటికే డిప్యూటేషన్ల పేరుతో రూ.లక్షలు వెనకేసుకున్న అధికారులు ఈ బదిలీల పేరుతో ఆమ్యామ్యాలకు తెర లేపుతున్నారు. సర్వీసు మేరకు పాయింట్లు కేటాయిస్తే సబ్‌రిజిస్ట్రార్ లేదా ఉద్యోగి మూడు ప్రాధాన్య పోస్టులు కోరుకోవచ్చు. అప్పుడు వాటి నుంచి కేటాయించాలి. సబ్ రిజిస్ట్రార్లు, సీనియర్ అసిస్టెంట్లు బదిలీ రిక్వెస్ట్ ఫారమ్స్ ఏలూరు డీఐజీ, జూనియర్ అసిస్టెంట్ కార్యాలయం సిబ్బంది జిల్లా రిజిస్ట్రార్‌కు పంపించాలి. కానీ ఇందుకు భిన్నంగా అవసరం ఉన్నా లేకున్నా అందరితో దరఖాస్తు చేయించి ఆదాయం వచ్చే సబ్ రిజిస్ట్రార్ పోస్టింగ్‌ల నుంచి వసూళ్లకు స్కెచ్ వేశారు.

ఇవీ ధరలు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.కోట్లలో భూ లావాదేవీలు జరిగే ప్రాంతాల్లోని జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ పోస్టులకు డిమాండ్ భారీగా కనిపిస్తోంది. ప్రాంతం, పోస్టును బట్టి రేటు నిర్ణయించారని శాఖలో ఉద్యోగులు చెవులు కొరుక్కుంటున్నారు. జిల్లా రిజిస్ట్రార్ పోస్టుకు రూ.60 లక్షల నుంచి రూ.కోటి వరకూ పలుకుతోంది. ఎక్కువ రిజిస్ట్రేషన్లు, లావాదేవీలు, అధిక ఆదాయం రావడమే ప్రామాణికంగా బదిలీల బ్రోకర్‌లు రేట్లు నిర్ణయించారు. కాకినాడ జాయింట్ సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో (రెండు సబ్‌రిజిస్ట్రార్‌లకు) డిమాండ్ ఎక్కువగా ఉంది. ఈ పోస్టు రూ. 60 లక్షల నుంచి రూ.కోటి పలుకుతోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అత్యధిక రేటు ఈ రెండు పోస్టులకు పలుకుతోంది. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్‌లో సర్పవరం, సామర్లకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సబ్ రిజిస్ట్రార్ పోస్టుకు రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షలు నిర్ణయించారు. అదే రాజమహేంద్రవరం వచ్చే సరికి జాయింట్ సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో రెండు సబ్‌రిజిస్ట్రార్ పోస్టులున్నాయి. ఈ పోస్టు రూ.60 లక్షల నుంచి రూ.80 లక్షలు పలుకుతోంది. తూర్పుగోదావరి జిల్లాలో రిజిస్ట్రేషన్‌లు అధికంగా జరిగే రాజానగరం, పిడింగొయ్యి సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల్లో సబ్‌రిజిస్ట్రార్ పోస్టులకు డిమాండ్ ఎక్కువగా ఉంది. ఒక్కో పోస్టుకు రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు బేరసారాలు జరుగుతున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురం జాయింట్ సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో రెండు సబ్ రిజిస్ట్రార్ పోస్టులకు డిమాండ్ ఎక్కువగా ఉంది. ఒకో పోస్టు రూ. 50 లక్షల నుంచి రూ.80 లక్షలకు బేరసారాలు ఆడుతున్నారు. ఇదే జిల్లాలో ముమ్మిడివరం సబ్ రిజిస్ట్రారు కార్యాలయాన్ని కూడా డిమాండ్ ఉన్న పోస్టింగ్‌ల జాబితాలో పెట్టారు. ఇక్కడి పోస్టింగ్ రేటు రూ.30 లక్షలుగా నిర్ణయించారు.

ఆయన విజయవాడ నుంచి చక్కబెట్టేస్తున్నారు

ఈ బదిలీల దందాలో విజయవాడ ప్రధాన కార్యాలయంలో మార్కెట్ అండ్ ఆడిట్ విభాగంలో పనిచేస్తోన్న రిజిస్ట్రార్ చక్రం తిప్పుతున్నారు. గతంలో రాజమహేంద్రవరం జిల్లాలో నియమించినా ఇక్కడకు రాకుండా ఇటువంటి దందాలకు అలవాటు పడ్డ సంబంధిత రిజిస్ట్రార్ విజయవాడలోనే తిష్టవేసి ఈ భాగోతాలను చక్కబెడుతున్నారు. కాకినాడ జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ పోస్టుల తరువాత స్థానంలో సర్పవరం సబ్‌రిజిస్ట్రార్ పోస్టుకు డిమాండ్ ఎక్కువ. అటువంటి సర్పవరం సబ్‌రిజిస్ట్రార్ పోస్టు ఏడాదిగా ఖాళీ ఉండటంతో ఇన్‌చార్జితో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. బదిలీలు ఉత్తర్వులు రాకముందే ఈ సబ్‌రిజిస్ట్రార్ పోస్టు రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలకు బేరం పెట్టారనే వార్తలు గుప్పుమన్నాయి. ఈ పోస్టులో ఈ నెల రెండో వారంలో జాయిన్ అయ్యారు. ఏలూరు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ పేరు సబ్‌రిజిస్ట్రార్‌ల బదిలీ జాబితాలో వెనక్కి పెట్టడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించి సబ్ రిజిస్ట్రార్ స్థానం సాధించారు. ఆయనను ఏలూరు ఆడిట్ సబ్ రిజిస్ట్రార్‌గా నియమించినా జాయిన్ అవ్వకుండా సర్పవరం సబ్ రిజిస్ట్రార్‌గా పోస్టింగ్ మార్చి తెచ్చుకోగలగడం విశేషం.

క్లుప్తంగా

29న ప్రత్యేక క్రీడా పోటీలు



మాట్లాడుతున్న శరత్, శ్రీరామచంద్రమూర్తి

సాక్షి, అమలాపురం: జిల్లా ఒలింపిక్స్, క్రీడా భారతి అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 29న క్రీడా దినోత్సవం రోజున ఎంపిక చేసిన ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక ఆటల పోటీలు నిర్వహిస్తామని క్రీడాభారతి జిల్లా అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పప్పుల శ్రీరామచంద్రమూర్తి (రాంబాబు) తెలిపారు. సోమవారం అమలాపురంలో వారు విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో క్రీడలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో 30 ఉన్నత పాఠశాలలను ఎంపిక చేసి పోటీలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఆయా పాఠశాలల్లో బాల, బాలికల విభాగాల్లో జూనియర్, సీనియర్స్‌కు విడివిడిగా పోటీలు నిర్వహిస్తామన్నారు. పరుగు పందెంతో పాటు జంప్, త్రో, స్పోర్ట్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయని వివరించారు. విజేతల్లో ప్రతి ఉన్నత పాఠశాలకు సర్టిఫికెట్, మెడల్స్ అందజేస్తామని, సుమారు వెయ్యి మంది క్రీడాకారులను ప్రోత్సహించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని శరత్, రాంబాబులు వివరించారు. విజేతలకు 29వ తేదీ హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ పుట్టినరోజు సందర్భంగా ‘నేషనల్ స్పోర్ట్స్ డే’ రోజున బహుమతి ప్రదానం పాఠశాలల వద్ద జరుగుతుందన్నారు. అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ గోకరకొండ నాగేంద్ర, ట్రెజరర్ కల్వకొలను భుజంగవాణి, కల్వకొలను బాబు, గౌరవ అధ్యక్షుడు రంకిరెడ్డి కాశీ విశ్వనాథం, జేఎన్ఎల్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

అయినవిల్లి: అతి వేగంగా వస్తున్న ఆటో, బైక్‌ను ఢీకొనడంతో బైకిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి ఎస్సై కేఎం జోషి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని విలస సాయిబాబా ఆలయం వద్ద సోమవారం ఆటో డ్రైవర్ అతి వేగంతో బైక్‌పై వస్తున్న తొత్తరమూడికి చెందిన పోతాబత్తుల నారాయణమూర్తి ఢీకొన్నాడు. ఈ ఘటనలో నారాయణమూర్తి మోకాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. గాయాల పాలైన నారాయణమూర్తి స్థానికులు వైద్యం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. దీనిపై బాధితుడిచ్చిన ఫిర్యాదుపై ఎస్సై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రత్యేక భద్రత కల్పించాలి



విధి నిర్వహణలో భాగంగా నైట్ డ్యూటీలు చేసే మహిళలకు ప్రత్యేక భద్రత కల్పించాలి. కోల్‌కతాలో జరిగిన దుర్ఘటన దేశంలోని అందరినీ కలచివేసింది. రాత్రి వేళ్లలో డ్యూటీలు చేసే డాక్టర్లు, నర్సులు తదితర మహిళా ఉద్యోగులకు రక్షణగా గార్డులను నియమించాలి. ఎక్కడైనా ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు నిందితులకు వెంటనే శిక్షపడే విధంగా చర్యలు తీసుకోవాలి. చదువుతున్న పిల్లలకు చిన్ననాటి నుంచే గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన తరగతులు నిర్వహించాలి.

–జి.ఢిల్లీప్రసాద్, వైద్యాధికారి, ఎస్.యానం పీహెచ్‌సీ, ఉప్పలగుప్తం మండలం



మహిళల గౌరవాన్ని కాపాడేలా..



ఆసుపత్రుల్లో ప్రతి మహిళా సిబ్బంది భద్రత, గౌరవాన్ని కాపాడడం అందరి కర్తవ్యం. మహిళా సిబ్బందిపై వేధింపులు నియంత్రించడానికి 24/7 సీసీ టీవీల ద్వారా నిఘా ఏర్పాటు చేస్తున్నాం. రోగులు, మహిళా సిబ్బందికి సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడాన్ని బాధ్యతగా తీసుకున్నాం. అన్ని ఆసుపత్రులు సేఫ్టీ క్వాలిటీ ప్రమాణాలు పాటిస్తూ మహిళలకు రక్షణ కల్పించాలి. అప్పుడే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలు ఉంటుంది.

–డాక్టర్ ఉమ, రేడియాలజిస్ట్, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, ట్రస్ట్ హాస్పిటల్స్, కాకినాడ

కలుపు అనర్థమే..!

పాడి-పంట



పెదపళ్లలోని వరి పొలంలో కలుపు తీస్తున్న మహిళా కూలీలు



కలుపు నివారణకు రసాయన ఎరువులను చల్లుతున్న రైతు

- సాగులో కలుపు నివారిద్దాం
- యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు
- అవగాహన పెంచుకుంటే పంట సిరులే

ఆలమూరు: ఏ పంటలోనైనా కలుపు వస్తోంది.. దీనిని పట్టించుకోకుంటే పంటల దిగుబడులపై ప్రభావం చూపుతోంది. వరి పంటలో కలుపు మొక్కల నివారణతో నాణ్యమైన ఉత్పత్తులకు అవకాశం ఉంటుంది. పొలాల్లో ప్రధానంగా సాగు చేసే పంటలో గడ్డి, ఇతర మొక్కలు పెరగడమే కలుపు అంటారు. సాగు భూముల్లో ఈ మొక్కలు ప్రధాన పంట కంటే త్వరితగతిన పెరిగి పోషకాలు, ఎరువులను స్వీకరించి దిగుబడిని తగ్గిస్తాయి. దీనిని నివారించకుంటే తెగుళ్ల బెడద ఎక్కువగా ఉండటంతో పాటు ఎరువులు, పురుగు మందుల వినియోగం భారీగా పెరిగిపోతుంది. నాణ్యమైన పంటలు పండక, దిగుబడులు రాక రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. కలుపు మొక్కలో సాధారణంగా పంటకు ఎక్కువ హాని కలిగించే వాటిల్లో ఊదర, వెడల్పాకు, తుంగ, ఏక వార్షిక గడ్డి జాతులు ఉన్నాయి. వీటి నివారణకు సాధ్యమైనంత మేర వ్యవసాయ శాఖ సూచనలు, సలహాల మేరకు క్రిమి సంహారక మందులను పిచికారీ చేస్తే చక్కని ఫలితం ఉంటుంది. సాధారణంగా రైతులు తమ పొలాల్లో నిర్ణీత సమయంలో కూలీలతో కలుపు తీయించేవారు. కూలీల కొరత తీవ్రతరం కావడంతో పాటు కూలి ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులు అవలంబిస్తున్నారు. కలుపు నివారణకు అనేక రసాయన మందులను పిచికారీ చేయిస్తున్నారు. హెర్బిసైడ్ వంటి అనేక మందులు మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చాయి. అయితే రసాయన, క్రిమి సంహారక మందులను అధికంగా వినియోగిస్తే లాభం కంటే నష్టమే అధికంగా ఉంటుంది. కలుపు నివారణకు ఏవిధమైన మందులు ఎంత మోతాదు మేరకు వినియోగించాలో రైతులకు అవగాహన పెంచుకుంటే కలుపును పూర్తిగా నిర్మూలించి అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ప్రస్తుతం మార్కెట్లో అనేక రకాల కలుపు మందులు లభిస్తున్నాయి. అయితే ఏ పైరుకు ఏ క్రిమిసంహారక మందును ఎంత మోతాదులో, ఏ సమయంలో ఎలా వాడాలో అన్ని వివరాలు పూర్తిగా తెలుసుకున్న తర్వాత మాత్రమే వాడాలి. సిఫారసు చేయని, పూర్తి వివరాలు తెలియని కలుపు మందులు ఎట్టి పరిస్థితులలో వాడకూడదు. అలా వాడితే కలుపు నిర్మూలన సరిగ్గా జరగక పోగా, కొన్ని సందర్భాల్లో పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. కలుపు మందును ఇతర సస్యరక్షణ మందులతో కలిపి వినియోగించకూడదు. కలుపు నివారణకు ఎల్లప్పుడు ఒకే మందు వాడకూడదని వ్యవసాయ శాఖ సూచిస్తుంది.

వ్యవసాయ శాఖ సూచనలతో..

వరి సాగు చేసే రైతులు వ్యవసాయ శాఖ సూచనలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు కలుపు మొక్కల నివారణకు ప్రత్యేక క్రిమిసంహారక మందులను వినియోగించాలి. వరి నాట్లు వేసిన మూడు నుంచి ఐదు రోజుల్లో ప్రెటిలాకోర్ ద్రావణం 500 మిల్లీలీటర్లు లేదా ఆక్సాడయార్జిల్ 20 గ్రాముల మందును నీటిలో కరిగే గుళికలతో మిశ్రమం చేసి చల్లుకోవాలి. పెట్ సల్ఫ్యూరాన్ లేదా క్లోరీ మ్యూరాన్ ఈథేల్ ఎనిమిది గ్రాముల మందును కలుపు రెండు నుంచి నాలుగు ఆకుల దశలో పిచికారీ చేయాలి. కలుపు నాలుగు ఆకుల దశలో ఉన్నప్పుడు బిస్పైరీబాక్ సోడియం లీటరు ద్రావణంలో ఎకరాకు 100 మిల్లీలీటర్ల మందును కలిపి పిచికారీ చేయాలి. పెనాక్సులం లేదా సైహాలోపాస్ బ్యూటైల్ ద్రావణాన్ని 900 మిల్లీలీటర్లు పిచికారీ చేస్తే అన్ని రకాల కలుపు మొక్కలు నిర్మూలించవచ్చు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



పంటల కలుపు నివారణలో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు. విత్తనం నాటిన నుంచి కలుపు నివారణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. పురుగు మందుల పిచికారీలో జాగ్రత్తలు తీసుకోకపోతే పంట తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంది.

–కె.నాగేశ్వరరావు, ఏడీఏ, ఆలమూరు

గంజాయి కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

గోకవరం: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ కె.శ్రీనివాసులు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 24న కృష్ణునిపాలెం పంచాయతీ రామన్నపాలెం జంక్షన్ సమీపంలో 25 ప్లాస్టిక్ సంచుల్లో సుమారు 813 కిలోల గంజాయితో ఉన్న బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకోగా, నిందితులు పరారీలో ఉన్న విషయం పాఠకులకు విదితమే. అల్లూరి సీతారామరాజు జిల్లా, పెదబయలు మండలం జాముగూడకు చెందిన వాహన యజమాని వంతల జయరామ్ సోమవారం రామన్నపాలెం జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో అతనిని గమనించిన కోరుకొండ సీఐ సత్యకిషోర్ అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద బ్యాగ్‌లో పది కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించగా, విచారణలో బొలెరో వాహనం అతనిదేనని తేలింది. ఒడిశా రాష్ట్రం చిత్రగుంటకు చెందిన వాహన డ్రైవర్ కిల్లో జయరామ్ అని డీఎస్పీ తెలిపారు. మంగళమాటం తాంగి చంద్రకార అనే వ్యక్తి నుంచి జయరామ్ గంజాయిని కొంటున్నట్టు పేర్కొన్నారు. వాహన యజమానివంతల జయరామ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించనున్నట్టు తెలిపారు. డ్రైవర్ కిల్లో జయరామ్, తాంగి చంద్రకారను తొందరలోనే అరెస్ట్ చేస్తామన్నారు. సమావేశంలో ఎస్సై వీఎస్‌వీ పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటిలో వానపాములు

అల్లవరం: నిర్లక్ష్యం అలముకుంది.. కనీస నిర్వహణ లేక తాగునీరు ప్రజలకు ప్రాణసంకటమైంది.. అయినా అధికారులకు చీమకుట్టినట్టు ఉండడం లేదు. ఒక్కసారి కాదు చాలాసార్లు వానపాములు తాగునీటిలో వస్తున్నా కనీస చర్యలు మాత్రం శూన్యం. మండలంలోని ఓడలరేవు మరిడమ్మ సెంటర్లోని పబ్లిక్ కుళాయి వద్ద సోమాని వెంకటరమణ బిందెల్లోకి తాగునీటిని నింపుకొంటున్నారు. ఈ క్రమంలో రెండు వానపాములు బిందెలోకి నీటి ద్వారా వచ్చాయి. గతంలో ఒకసారి వానపాము రాగా, ఆర్‌డబ్ల్యూఎస్ జేసీ స్వామి దృష్టికి తీసుకెళ్తే లీకేజీ కారణంగా వానపాములు వచ్చాయని సమాధానం ఇచ్చారని వెంకటరమణ తెలిపారు. లీకేజీ సమస్య పరిష్కరించడంతో వానపాములు వచ్చే అవకాశం ఉండదని జేఈ చెప్పారన్నారు. అయితే సోమవారం పంపిణీ చేసిన తాగునీటిలో రెండు వానపాములు మళ్లీ వచ్చాయని, దీనికి అధికారులు ఏం సమాధానం ఇస్తారని అన్నారు. ప్రజల ఆరోగ్యంతో ఇలా చెలగాటం ఆడడం సరికాదని మండిపడ్డాడు. ప్రస్తుతం టైఫాయిడ్, విష జ్వరాలు వ్యాప్తి చెందుతున్న తరుణంలో అధికారులు చిత్తశుద్ధితో పని చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు.



ఓడలరేవులో కుళాయి ద్వారా వచ్చిన నీటిలో వానపాములు (వృత్తంలో ఉన్నవి)

రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఎస్సై మృతి



తాళ్లరేవులో విద్యుత్ స్తంభాన్ని ఢీకొని మృతి చెందిన అప్పారావు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని తాళ్లరేవు బైపాస్ రోడ్డులో సోమవారం జరిగిన ప్రమాదంలో కాకినాడకు చెందిన విశ్రాంత ఎస్సై మోర్త అప్పారావు (66) మృతి చెందారు. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ కథనం ప్రకారం.. కాకినాడ కొండయ్యపాలెం మిలట్రీ రోడ్డులోని చర్చివీధిలో నివాసం ఉంటున్న అప్పారావు తన స్వగ్రామమైన తిళ్లకుప్పలో వ్యవసాయ భూములను చూసుకునేందుకు ద్విచక్ర వాహనంపై బయలు దేరారు. తాళ్లరేవు బైపాస్ రోడ్‌లోని కేశవస్వామి కాలనీ దుర్గాదేవి ఆలయం సమీపంలో బైక్ అదుపుతప్పి రహదారి చెంతనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో అప్పారావు తల, ముఖంపై తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కోరంగి ఎస్సై సత్యనారాయణ అక్కడకు చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. బైక్‌కు ముందు పెట్టుకున్న ఒక బ్యాగ్ కారణంగా అదుపుతప్పి పడిపోయి ఉంటారని, ప్రమాదవశాత్తూ జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా జాతీయ రహదారిలో రెండు రోజుల వ్యవధిలో రెండు ప్రమాదాలు చోటుచేసుకుని ఇరువురు మృత్యువాత పడడంతో స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బెంబేలెత్తిపోతున్నారు. ప్రమాదాల నివారణకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలకు వేళాయె..

- నేటి నుంచి విద్యార్థులకు పరీక్షలు
- 1–8 తరగతులకు ఓఎంఆర్ బేస్డ్, 9, 10లకు ఫార్మేటివ్



అమలాపురానికి చేరుకున్న ఓఎంఆర్ షీట్లు

రాయవరం: ప్రతి విద్యార్థి అభ్యసనా సామర్థ్యాలను అంచనా వేసేందుకు పరీక్షలు తప్పనిసరి. అందుకే విద్యా శాఖ ఏటా ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు నాలుగు, సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు రెండు నిర్వహిస్తోంది. ఇప్పటి వరకూ జరుగుతున్న ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలను సెల్ఫ్ అసెస్‌మెంట్ (స్వీయ అంచనా) పరీక్షలుగా మార్పు చేశారు. 2024–25 విద్యా సంవత్సరంలో నాలుగు సెల్ఫ్ అసెస్‌మెంట్, రెండు సమ్మేటివ్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించేందుకు నిర్వహిస్తున్న సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలను 2022–23 విద్యా సంవత్సరం నుంచి ప్రయోగాత్మక విధానంలో ‘క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్’ను ప్రవేశపెట్టారు. ఇదే విధానాన్ని ఈ విద్యా సంవత్సరంలో కూడా కొనసాగిస్తున్నారు. గత విద్యా సంవత్సరం మాదిరిగానే 1–8 తరగతుల వరకూ సీబీఏ విధానం, 9, 10 తరగతులకు ఫార్మేటివ్ విధానంలో పరీక్షలు ఉంటాయి. ఇందుకు సంబంధించి డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు అవసరమైన చర్యలు తీసుకుంటుంది.

అకడమిక్ క్యాలెండర్ ప్రకారం

జూన్, జూలై సిలబస్‌కు సంబంధించి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల మదింపునకు సీబీఏ, ఫార్మేటివ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల ద్వారా అభ్యసన లోపాలను గుర్తించడంతో పాటు, పక్కా బోధనతో వారిలో సామర్థ్యాలను వెలికి తీయడం సీబీఏ పరీక్షల ప్రధాన ఉద్దేశం. గుణాత్మక విద్యను అందించడం.. ఉత్తమ విద్యా ప్రమాణాలను పెంచేందుకు 2022–23 విద్యా సంవత్సరం నుంచి సీబీఏ విధానం అమలు చేస్తున్నారు. సెల్ఫ్ అసెస్‌మెంట్, ఎస్ఏల స్థానంలో సీబీఏ పరీక్షలు నిర్వహించనున్నారు. ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు సెల్ఫ్ అసెస్‌మెంట్–1, 3, ఎస్ ఏ2కు బదులుగా సీబీఏ విధానంలో నిర్వహిస్తుండగా, ఎఫ్ఏ 2, 4, ఎస్ఏ 1 పాత విధానంలోనే జరుపుతున్నారు. 9, 10 తరగతులకు నాలుగు ఎఫ్ఏలు, రెండు సమ్మేటివ్ పరీక్షలు పాత విధానంలో అమలు చేస్తారు.

బైలింగ్వల్ ప్రశ్న పత్రాలు

సీబీఏ విధానంలో నిర్వహిస్తున్న పరీక్షలకు విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నపత్రం బైలింగ్వల్ విధానంలో ఉంటుంది. విద్యార్థికి ఇంగ్లిషులో ప్రశ్నపత్రం అర్థం కాకుంటే తెలుగులో చదివి ప్రశ్నను అర్థం చేసుకునేందుకు గతేడాది నుంచి బైలింగ్వల్ ప్రశ్న పత్రాలను ప్రవేశపెట్టారు. ప్రశ్నపత్రంలోని 10 ప్రశ్నలు ఆబ్జెక్టివ్ విధానంలో, ఐదు ప్రశ్నలు రాత పూర్వక విధానంలో ఇస్తారు. మొత్తం 15 ప్రశ్నలకు 20 మార్కులు కేటాయిస్తారు. ప్రశ్నలన్నీ విద్యార్థి సమగ్రంగా అంచనా వేసే విధంగా ఉంటాయి. మెకానికల్.. అండర్ స్టాండింగ్.. అప్లికేషన్ (ఎంయూఏ) ప్రశ్న పత్రం ఉంటుంది. సీబీఏ విధానంలో పరీక్షలు రాసే విద్యార్థులు ప్రశ్నలకు సమాధానాలను ఓఎంఆర్ షీట్లలో నింపాల్సి ఉంటుంది. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు మాత్రం రాతపూర్వక సమాధానాలు రాస్తే సరిపోతుంది.

నేటి నుంచి పరీక్షలు

సీబీఏ విధానంలో నిర్వహించే పరీక్షలు ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ నాల్గో తేదీ వరకూ నిర్వహిస్తారు. ఎయిడెడ్, ప్రభుత్వ, జెడ్పీ యాజమాన్యాల్లో 98,563 మంది, ప్రైవేట్ యాజమాన్యంలో 1,01,790 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కాగా సీబీఏ విధానంలో 1–8 తరగతుల వరకూ ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 71,478 మంది, ప్రైవేట్ యాజమాన్యంలో 77,413 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, పాత విధానంలో ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల నుంచి 9, 10 తరగతులకు చెందిన 27,085 మంది, ప్రైవేట్ యాజమాన్యం నుంచి 13,287 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

పేపర్ లీకైతే కఠిన చర్యలు



గత రెండు విద్యా సంవత్సరాలుగా క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఈ విధానంపై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పూర్తి అవగాహన ఉంది. ఈ విద్యా సంవత్సరంలో కూడా సీబీఏ విధానంలో ఈ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పరీక్ష పేపర్లు లీకైతే, ఏ స్థాయిలో లీకైందో గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటాం.

–ఎం.కమలకుమారి, జిల్లా విద్యాశాఖాధికారి, అమలాపురం

సామర్లకోటలో వ్యక్తి దుర్మరణం



రైలు నుంచి జారిపడి మృతి చెందిన దాస్

పెదపూడి: ప్రమాదవ శాత్తు రైలు నుంచి జారిపడి ఒక వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. సామర్లకోట జీఆర్పీ ఎస్సై బి.లోవరాజు కథనం ప్రకారం.. సోమవారం చైన్నై నుంచి వస్తున్న రైలులో ఉన్న ఒడిశా రాష్ట్రం షార్ఘుడకు చెందిన సీహెచ్ దాస్ (41) అనపర్తి రైల్వే స్టేషన్‌లో ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. దీంతో అతని తలకు బలమైన గాయమైంది. ఈ ప్రమాదం జరిగిన వెంటనే 108 అంబులెన్స్‌లో తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా అతను అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. సామర్లకోట రైల్వే పోలీసులు వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానమే పెనుభూతమై..

- భార్యను హత్య చేసిన భర్త
- అనపర్తిలో సంఘటన



భర్త చేతిలో హత్యకు గురైన అరుణకుమారి

పెదపూడి: అనుమానమే పెనుభూతమైంది.. చివరికి ఏడడుగుల బంధంతో ఒక్కటైన భార్యనే హత్య చేసేలా ఉసిగొల్పింది.. అనుమానంతో భార్యతో గొడవలు పడుతూ చివరికి ఆమెను ఓ భర్త హత్య చేసిన సంఘటన ఇది. సోమవారం అనపర్తి సీఐ గణేష్ తెలిపిన కథనం ప్రకారం.. అనపర్తి పాత ఊరులో టి.సాయి, అతని భార్య అరుణకుమారి (26) కలసి జీవిస్తున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు. కోడిగుడ్ల వ్యాన్ డ్రైవర్‌గా సాయి పని చేస్తున్నాడు. కొంతకాలంగా భార్యపై అనుమానంతో గొడవలు జరుగుతున్నాయి. అయితే సోమవారం సాయంత్రం సమయంలో భార్యాభర్తల మధ్య గొడవ మొదలైంది. ఈ ఘర్షణలో అరుణకుమారి తలపై డంబెల్స్‌తో అతను బలంగా మోదాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఉత్తరాంధ్రలోని బొబ్బిలి ప్రాంతానికి చెందిన వీరు పదేళ్ల కిందట ఇక్కడకు వచ్చి స్థిరపడ్డారు. సమాచారం తెలుసుకున్న సీఐ గణేష్, ఎస్సై శ్రీనునాయక్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి తాగిన యువకుడిపై కేసు

తుని: గంజాయి తాగి ప్రజలను ఇబ్బందులకు గురి చేసిన ఓ యువకుడిపై కేసు నమోదు చేశామని తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి విశాఖపట్నం ఎండాడకు చెందిన డి.సన్నిబాబు తునిలోని స్నేహితుడిని కలిసేందుకు వచ్చి మద్యం, గంజాయి తాగాడు. అనంతరం సన్నిబాబు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సు ఎక్కి ప్రయాణికుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో బస్సు నుంచి దించేశారు. దీంతో కాంప్లెక్స్ దగ్గర న్యూసెన్స్ చేయడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. అతన్ని పోలీసులు స్టేషన్‌కు తీసుకురాగా అక్కడా వీరంగం చేయడంతో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. తర్వాత ప్రభుత్వ ఆసుపత్రి గేటు ముందు మళ్లీ గలాటా చేశాడు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

కాలువలో పడి వ్యక్తి మృతి



అక్కురాజు (ఫైల్)

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి గ్రామ పంచాయతీ పరిధి ఇందిరానగర్‌కు చెందిన గుబ్బల అక్కురాజు (35) ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఆదివారం సాయంత్రం కట్టెలు తీసుకొస్తానని అక్కురాజు ఇంటి నుంచి బయలు దేరాడు. రాత్రి అవుతున్నా ఎంత సేపటికీ తిరిగి రాకపోవడంతో భార్య తన మరిది శ్రీనుకు తెలిపింది. తన అన్నను వెతుక్కుంటూ వెళ్లిన శ్రీనుకు అక్కురాజు కాలువలో ఒడ్డున మృతదేహంగా కనిపించాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెచ్‌సీ పి.రామకృష్ణ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

రౌతులపూడి: మండలంలోని లచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన చందక కాశీ అనే యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు రౌతులపూడి ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. లచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన చందక కాశీ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, గర్భవతిని చేసినట్లు ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గర్భం దాల్చిన బాలికను తల్లిదండ్రులు వైద్య పరీక్షల కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షలు చేసి ఆ బాలిక గర్భం దాల్చినట్లు నిర్ధారించారు. ఈ మేరకు పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి ఆధ్వర్యంలో గ్రామంలో పోలీసులు సోమవారం విచారణ చేపట్టారు.